

# రాజసం

—డి. శివరావ్ శాస్త్రి

గతించిన వైభవం యింకా మాసిపోని సువిశాలమైన ఆ హాల్లో ఆ వూరి పెద్దమనుషులు కూర్చుని చుట్టూ గోడలకి వున్న వెలిసిపోతున్న గిల్టు ఫ్రేముల నిలువెత్తు తైలవర్ణ చిత్రాలలో రాజసం తొంగి చూసేలా నిలబడ్డ క్రిందటి తరాల రాజుల ఔన్నత్యాన్నీ, దాతృత్వాన్నీ గురించి నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. వారందరి కళ్ళల్లో భక్తి ప్రపత్తులు కనిపిస్తున్నాయి.

అంతఃపురంలో విశ్రాంతి తీసుకుంటున్న "రావు బహదూర్ రాజా కులదీప రాయణిం" గారికి వారి రాక గురించి విన్నవించాడు ఆ భవన ప్రత్యేక సేవకుడు 'రాయుడు'. పూర్వం "అద్దాల మహల్" అని పిలవబడే ఆ గది పెద్ద రాణీవారి శయ్యా మందిరం.

ఆ గదిలో నుంచి దర్బారు హాల్లో ఏం జరిగినా చూడగలిగే ఏర్పాటువుంది. రాజావారు లేచి దర్బారు హాల్లో కూర్చుని వున్న పెద్దమనుషుల హావ భావాలని పరిశీలించి వారి ముఖాలలో కనిపిస్తున్న వినయ విధేయతలకి తృప్తిపడ్డారు.

ఆ అద్దాల మహల్లో మిగిలి వున్న ఒక్క అద్దంలో తన రూపాన్ని చూసుకున్నారు. మెలిదిరిగిన మీసాలు, నెరిసినా వెండిలా మెరుస్తూ అందంగా కనిపించే గిరజాల జుట్టు, విశాలమైన తెల్లని నుదుట పడ్డ ముడతలు ఆయన ఆరడుగుల ఆజానుబాహు విగ్రహానికి యింకాస్త ఠీవినీ, వింత ఆకర్షణనీ కలిగిస్తున్నాయి. ఇలాంటి దర్శనాల కోసం అల్మారాలో వుంచిన జరీపూల షేర్వాణీ తీసి అక్కడక్కడా చిరుగుపడుతున్న అంగరఖా మీద ధరించారు. పైన మడతల పట్టు వుత్తరీయం వేసుకున్నారు. నల్లగా మెరుస్తున్న పాముతల చేతి కర్ర, బ్రిటీష్ కాలంనాటి పైపు చేతుల్లోకి తీసుకుని మరోసారి అద్దంలో చూసుకుని 'రాయుడూ' అన్నారు మెల్లగా నిట్టూర్చి. ఆయన గంభీర స్వరంలో గతించిన దర్పం, నిట్టూర్పులో గుండెల్లో రగులుతున్న విషాదం మిళితమై జీరగా ధ్వనించాయి. గది బయట నిలుచున్న రాయుడు 'చిత్తం దొరా' అన్నాడు వినయంగా.

రాయణింగారి భార్య గతించిన తర్వాత ఆయన యిద్దరు కొడుకులూ రాచరికపు పడగనీడన యీ కాలంలో బ్రతకలేక ఎవరిదారి వారు చూసుకున్నారు. జమిందారులూ, రాజులూ మంత్రులుగా మారి మహారాజులుగా వెలుగుతున్న యీ రోజుల్లో కీర్తికాంత యింకా వదలని ఆ భవంతిలో ఒంటరి రాజావారికి విశ్వాసపాత్రుడూ, సేవకుడూ తోడుగా మిగిలింది రాయుడు ఒక్కడే.

ఆ భవంతి దర్బారు హాలులోని ఫర్నిచరు, షాండ్లీర్ తప్ప మిగిలిన అన్ని గదులలోని విలువైన వస్తువులు, అద్దాలు, అలంకారాలు, వెండి బంగారు పాత్రలు అన్నీ గతించాయి. ఒక్కొక్క వస్తువూ సిటీలోని 'యాంటిక్' షాపుల్లో అమ్మబడ్డాయి రహస్యంగా. రాయణింగారు వారి కీర్తి ప్రతిష్టలూ, వంశ మర్యాదలూ, దర్జా, దర్పంల కేమాత్రం లోటు రానీయకుండా వ్యవహరిస్తారు. ఆ జిల్లాలో వారి పూర్వీకులు దాన ధర్మాలు చేసిన భవనాలు, మడులు, మాన్యాలు ఎన్నో వున్నాయి. ఆ వూరికి వచ్చిన పెద్ద ఆఫీసర్లు, మంత్రులు రాయణింగారి దర్శనం, ఆతిధ్యం పొందవలసిందే యీ నాటికీ. నెల రోజుల క్రితం రాజా రాయణింగారి డెబ్బైయవ జన్మ దినోత్సవ సన్మాన సభలో మంత్రిగారి సమక్షాన ఆ వూరి పెద్దలు ఆ వూరికి కాలేజీ లేని లోటును, దాని అవసరాన్నీ ప్రతిపాదించారు. ఆ వూరి నుంచే ఎన్నికైన మంత్రి గారు 'రాజాకులదీపరాయణింగారి' పేరు మీదే ఆ కాలేజీ నిర్మించాలని వెంటనే తీర్మానించి, దానికి రాజావారి దాతృత్వానికి తగ్గట్లు భూరి విరాళం యివ్వాలనీ సూచించారు. రాజావారు వారి వంశ ప్రతిష్టకి తగినట్లు ఐదు లక్షల రూపాయిలు విరాళంగా ప్రకటించారు. ఆ సభలో తమ పూర్వీకులనీ, వారి పేరు ప్రతిష్టలు నిలుపుతున్న తమనీ కీర్తిస్తూ చేసిన వుపన్యాసాలకీ, ప్రజల జయజయ ధ్వానాలకీ రాయణింగారికి తమ బాల్యం, వారి తండ్రి, తాతగార్ల వైభవం మదిలో రాజావారి పేరు మీద నెలకొల్పబడే కాలేజీ నిర్మాణ కమిటీ ఛైర్మన్ కోటయ్య, మెంబర్లూ యీ రోజు వేచి వున్నది ఆ విరాళం కోసమే. వెనక గదులని మరుగుపరుస్తూ కట్టిన పట్టు తెరని కాస్త తొలిగించి పట్టుకుని రాయుడు రాజావారి ఆగమనం ప్రకటించగా అందరూ లేచి నిలబడ్డారు. రాయణింగారు పైపు పీలుస్తూ ఠీవిగా వేంచేసి వారందరి ప్రణామాలూ స్వీకరించి వారి ప్రత్యేక ఆసనం మీద వుపవిష్టులై చిరునవ్వు నవ్వారు. కమిటీ ఛైర్మన్ కోటయ్య చేతులు నలుపుకుంటూ సవినయంగా తమ రాకకు గల కారణం విన్నవించాడు. రాజా వారు తన కళ్ళ లోతుల్లో కదిలే విషాదం ఎవరూ గమనించకుండా జాగ్రత్తపడుతూ అదే చిరునవ్వుతో తల పంకించారు. కొంతసేపు రాయణింగారి కీర్తి గానంచేసి కమిటీ మెంబర్లు సెలవు తీసుకున్నారు. ఆ మధ్యాహ్నం రాజావారి దర్శనానికి సిటీలో పేరు మోసిన సేఠ్ వచ్చాడు బ్రీఫ్‌కేస్‌తో. కాగితాలపై సంతకాలు జరిగాయి. రాజావారి చిట్టచివరి కీర్తి స్తంభం ఆ 'భవంతి' చేతులుమారింది ఐదు లక్షలకి. ఆ డబ్బు కాలేజీ కమిటీకి అందజేయబడింది ఆ సాయంత్రమే.

తెల్లవారి ఆ చుట్టుపక్కల వూళ్ళ ప్రజలు రాజా రాయణింగారి మరణవార్త విని దిగ్భ్రాంతులై వారి భౌతిక కాయాన్ని అంతిమ దర్శనం చేసుకో డానికి భవంతి ముందు బారులు తీరసాగేరు. రాజా వారి భౌతికకాయం జరీపూల షేర్వాణీ, పైన పట్టు వుత్తరీయం, గులాబి రంగు తలపాగా, పూలదండలతో దర్పంగా, దర్జాగా దర్బారు హాల్లో వుంది. వారి ముఖం కొంచెం నీలి వర్ణంగా కనిపిస్తోంది పరీక్షగా చూస్తే.

వారి అంతిమ సంస్కారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఆ సాయంత్రం జరిగిన సంతాప సభలో రాజావారి గత చరిత్ర ఘనకీర్తి, వారి దాతృత్వం వేనోళ్ళ పొగడ్తల మధ్యలో ఒక వక్త వారి శరీరపు నీలి వర్ణాన్ని రాజవంశపు 'బ్లూ బ్లడ్'గా వర్ణించాడు.

"రావు బహదూర్ రాజా కులదీపరాయణిం గారి కాలేజి" ముందు వారి శిలా విగ్రహం ప్రతిష్ఠించడానికి తీర్మానం జరిగింది. రాజావారి కీర్తి పతాకం నిలుస్తుంది. కానీ ఎవరికీ తెలియనిది రాజావారు క్రితం రాత్రి 'పాయిజన్' త్రాగి నిద్రపోయారని.

◆

**1988 వినాయక చవితి కథల కాలం దాటని కథల పోటీలో రు. 75/లు గెలుచుకున్న కథ**